# అనుసరింపదగ్గ జీవితం

వేదుల సూర్యనారాయణ శర్మగారు

నాకు పరీక్షరోజులు. మధ్య మధ్య చాలా అవాంతరాలువచ్చి తఱచుగా కాలేజీ మానెయ్యడంచేత కోర్సులలో చాలా వెనకబడ్డాను. అందుచేత దీక్షగా అహోరాత్రులు పాఠాలు పారాయణచేస్తూ ఉండేవాణ్ణి.

ఇల్లాఉండగా ఓరోజున రాత్రి అప్పుడే హోటలికెళ్లి భోంచేసొచ్చి చదువుకుందామని కిటికీగూట్లో ఉన్న కాగితపొట్లందీసి, లైటుగ్లాసుతుడిచి వెలిగించాను. ఏమిటో కాకతాళీయంగా నాదృష్టి లైటుతుడిచేసిన కాగితంమీదికి వాలింది. వెంటనే ఆకాగితంతీసి పదిలంగా సాపుచేసిచూశాను. ఆశ్చర్యం!!! అది ఓ ప్రియురాలు ప్రియునికి వ్రాసిన వలపుకమ్మ. "నన్ను నువ్వు చూడకపోయినా నేను ప్రతిరోజూ నిన్ను సారించిచూస్తూ ప్రేమభిక్షకై యాచిస్తూనేవున్నాను. ఎప్పుడాదరిస్తావో" అనిఉంది దాన్లో. అది చదువుకోడంతోటే నా భావప్రపంచం అంతా గందరగోళం అయిపోయింది. ఓ భావంవచ్చి కాస్సేపుతోచి నిలువడం ఇంకో అభిప్రాయంవచ్చి దాన్నితోసెయ్యడం ప్రారంభించింది. ఏదీ గడియసేపైనా నిలువలేదు. పుస్తకంమూసేసి చాపమీద పడుకొని దూలాలకేసిచూస్తూ దీర్ఘంగా ఆలోచనకు ప్రారంభించాను. నేను తఱచుగా తిరిగేచోట్లన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ యీ ఉత్తరం రాసినవారెవరై ఉంటారా అని పెద్దగా విమర్శించాను. అయితే ఈ ఆలోచనంతా ప్రేమనాశించికాదు. నా యుత్తరజీవిత సౌధానికి అసలు బ్రహ్మచర్యాన్నే పునాదిచేసికొని సుఖించాలని నా తలంపు. నా నిష్కళంక బ్రహ్మచర్యంలో అల్లాంటి మలినాని కింతవరకూ ఎక్కడా చీమకాలంతైనా తావియ్యలేదు. ఇప్పుడు ఇవ్వడంలేదు. ముందెప్పుడూ ఇవ్వదల్చుకోనూ లేదు. అయితే పరీక్షరోజుల్లో పాఠాలుకూడామానేసి యీ బాధంతా ఎందుకంటారేమో. కేవలం తత్వార్థాన్వేషణకే. అంతకంటె ఫలాపేక్ష మరేమీలేదు. ఇంతకీ ఆలేఖ రాసిందెవరో ఏమీ నిర్ధారణకాలేదు. ఒంటిగంటదాకా అదే ఆలోచిస్తూ బలవంతంగా నిద్రాదేవి ఆహ్వానం అందుకున్నాను. నిద్రలోకూడా ఇల్లా ఆలోచిస్తూన్నట్టేకలలు. ఎల్లాగో తెల్లారింది. ముఖం కడుక్కోడంతోటే కాఫీకి పాలు తెచ్చుకొందామని అక్కడికి 20 గజాలదూరంలోఉన్న గొల్లయింటికి వెళ్లేను. నా శరీరంమాత్రం ఏదో కొన్నిపనులు తబ్బిబ్బుగా చేస్తోందేకాని మనస్సంతా ఆలేఖమీదే లగ్నం అయిపోయింది. ఎల్లాగో గొల్లయింటికి చేరేను. గొల్ల ఇంకాలేచి యీవలికిరాలేదు. ఆ గొల్లదాని యింటికి వీధిపైపున నాలుగుగజాలదూరంలో ఒక మట్టికాంపౌండుగోడకుచేరి ఓగుమ్మంఉంది. గొల్లది యింట్లోంచివచ్చి తలుపుతీస్తే లోపలికెళ్లాలి. తఱచుగా గొల్లది తలుపేసుకొని ఉండడం నేను కేకెయ్యడంతోటే తియ్యడం మామూలుగాఉంది. అల్లాగే ఆవేళకూడా 'గడ్డెమ్మా' అని కేకేశాను. ఆకేక లోపలికి అందలేదు. మళ్లీ కేకేశాను. తలుపు తియ్యబడలేదు కాని ఆ కాంపౌండుగోడ కంటి ప్రక్కనేయున్న ఇంటియొక్క వీధికిటికీ తెరవబడింది. ఆ కిటికీ ఊచలసందులోంచి ఒక యిరవైయేళ్ల యువతి నాకేసి నిబ్బరంగాచూసి ఒక్కక్షణం నిలబడి ప్రక్కకివెళ్లిపోయింది. నేనుకూడా చూసీచూడనట్టు ఆమె ప్రవర్తనంతా పరికిస్తూ అల్లాగే నిలబడ్డాను. ఆవిడ మళ్లీమళ్లీ ఆ కిటికీమయంగానించుని నాకేసే చూడ్కులు నిగిడిస్తూ ప్రక్కకి తప్పుకుంటూ అల్లాగేచేస్తూంది. ఇంతలో గడ్డెమ్మవచ్చి తలుపుతీసింది. గ్లాసులోకి పాలు పిలికించుకొని తిరిగి వీధి గుమ్మందగ్గిరికి వచ్చాను. రోడ్డంతా గోదావరికి వెళ్లివచ్చే జనంతో సందడిగా ఉండడంచేత వచ్చేటప్పుడు ఆవిణ్ణి సావకాశంగా చూడలేదు కాని నేను వెళ్లిపోయేటప్పుడు ఆవిడనిగిడించిన చూపులుమాత్రం నాలో కొంత కలతపుట్టించాయి. ఒకవేళ ఆ ఉత్తరం ఈమెగాని వ్రాసిందేమో అని అనుకుంటూ బయలుదేరాను. పరధ్యాన్నంగా నడవడంచేత దారిలో ఎదురుగావచ్చిన ఒకమనిషి చెయ్యితగిలి పాలన్నీ ఒలికిపోయాయి. పైగా ఆమనిషి 'ఏమిటయ్యా కళ్లునెత్తి మీదపెట్టుకొని నడుస్తావ్' అని [illegible]లించాడు.

లోటు నాదే అవడంచేత అతన్ని ఏమీఅనక వెనక్కి మళ్లీ గద్దెమ్మింటికి వెళ్లి నా మంచిపాలు ఎల్లాగా దొరకవనీ, ఆ యువతిచూస్తే తన్ను చూడ్డానికే మళ్లీ నేను ఏదోమిష పెట్టుకొని వచ్చానని అనుకుంటుందేమో అనీ వెనక్కెళ్లక తిన్నగా కొట్టుకిచేరుకున్నాను. రోజూ ఆరుగంట లయ్యేటప్పటికల్లా కాఫీ లేకపోతే నిలవక లేకపోయేవాణ్ణి ఆవేళ కాఫీదృష్టేలేదు. ఆ లేఖమీదా ఆ యువతిమీదా ఉంది మనస్సంతాను. 'ఆ యువతే ఆలేఖ రాసిందని ఎల్లాగా అనుకోడం? ఆచూపులూఅవీ స్వాభావికమైనవే కాగూడదూ' అని అనుకొని ఆ యువతిమీదనుంచి మనస్సు మళ్లించి మామూలుగా భోంచేసి కాలేజికి వెళ్లాను. అప్పట్నుంచి నేను తరుచుగా వెళ్లేచోట ఎక్కడైనా ఆడవాళ్లు కనబడితే వారికేసి చూసీచూడనట్టు వాళ్ల భావం కనిపెట్టడానికి ప్రయత్నించడం మొదలుపెట్టాను. అల్లా నాలుగైదురోజులు గడిచిపోయాయి. ఆ మొదటియువతి తప్ప అల్లాంటి భావాన్ని పురికొల్పే మరేస్త్రీనాకెక్కడా అగపళ్లేదు. అయినా ఇంకా నేను ఆవిణ్ణే నిర్ధారణచేసుకోలేదు. ఇల్లాఉండగా మళ్లీ ఓరోజున ప్రొద్దున్న మొఖంకడుక్కుం దామని పందుంపుల్లకి కిటికీకేసి చూసేటప్పటికి వెనకటి మల్లేనే యింకోలేఖ కన్పడింది. 'ప్రియుఁడా! దయలేదు. ఎప్పుడాదరిస్తావో' అని వ్రాసుంది దాన్లో. దస్తూరీ, కాగితపు పరిమాణస్వరూపాలు మొదటిలేఖని పోలేఉన్నాయి. నా మనస్సు అడివిలా అలుముకుపోయింది. వెంటనే రెండు నిమిషాల్లో మొఖం కడుక్కొని నాలుగుమ్ముప్పావుకే గ్లాసు తీసుకొని పాలకు బయలుదేరాను. మామూలుప్రకారంగా 'గద్దెమ్మా! అని కేకెయ్యడంతోటే కిటికీ తెరవబడింది. ఆ యువతి విలాసంగా చూడ్డం ప్రారంభించింది. మనస్సులో వలుసంగైనా అసలు ఉద్దేశ్యం నాకు లేకపోయినా ఆవిడ ఉద్దేశ్యం తెలుసుకుందామని నేనుకూడా కొంచెం ఓరగా సాభిలాషగా ఆమెకేసి చూడ్డం ప్రారంభించాను. అప్పటికింకా రోడ్డుమీద అంత సద్దుగాలేదు. రెండెడ్లబళ్లు మాత్రం వస్తూన్నాయి. అక్కడక్కడ చెదురుపాటుగా మనుష్యులు గోదావరికి వెడుతూన్నారు. నా చూపులు ఆవిడ అర్థంచేసుకున్నట్టు చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది. అల్లా పదినిమిషాలు గడిచాయి. క్రమంగా రోడ్డుమీద సందడి ఎక్కువవడంచూసి మనకి మనస్సులో లేకపోయినా ఎవరైనా చూస్తే బాగుండదని నే నంతటితో నా దృష్టిని వెనక్కిమళ్లించి తిరిగి గద్దెమ్మను కేకేసి పాలు పితుకించుకుని యావలికి వచ్చాను. వచ్చేటప్పుడు వద్దని నా మనస్సు ఎంత వెనక్కిలాగుతూన్నా వినక నా చూడ్కులు కిటికీ కేసిచూశాయి. అంత ఆవిడ ఓ చీటీచూపించి అందుకొమ్మని కిటికీలోంచి వెలుపలికి పడేసింది. నేను ఇటూ అటూ ఎవరులేకుండా చూసి బహుజాగ్రత్తగా ఆ చీటితీసికొని వేగంగా కొట్టుచేరుకొని విప్పిచూశాను. అప్పటికి లేఖాకర్త్రి ఎవరో స్పష్టంగా తెలిసికోగలిగాను. ఆ చీటిలో "ప్రియుఁడా! నీతో......చో...అవుతుందని భయం. ముద్దుపెట్టుకొని తనివితీర్చుకుంటా. రాత్రి 12 గంటలికి ఉత్తరంవైపు చెట్టుక్రిందికి రావాలి" అని ఉంది. అదేంవిటోగాని ఎంతో నిష్కళంకమనస్సుతో ఉన్నా నిజంగా ఎంతో అపరాధం చేసినవాడిలాగ నాకప్పుడు కొంచెం కంపం బయలుదేరింది. ఆచీటీ తిరిగి చదివేను. మళ్లీ చదివేను. ఎల్లాలేదన్నా పదిసార్లైనా చదివేను. కొంతసేపటికి ఆ వ్రాసిన వ్రాతనుబట్టి ఆవిడ ఒక బాలవితంతువై యుంటుందని స్పష్టంగా తెలిసికోగలిగాను. వెంటనే నా మనస్సు వజ్రాయుధమై పూర్వాచార సిద్ధాంతాల్ని నరికివెయ్యడం ప్రారంభించింది. అప్పుడప్పు డప్రయత్నంగా కొన్ని రోషపూరితములైన వాక్యాలుకూడా పైకి వినబడ్డాయి. తర్వాత ఆక్రోశాగ్ని అంతా చల్లారి ఒక్కమాటు జాలిగామారి ఆ యువతిమీదవెల్లి విరిసికురిసింది. నాకు కర్తవ్యాంశమేమీ నిర్ధారితంకాలేదు. ఇప్పు డేంచెయ్యాలి? నా పవిత్రజీవితానికి కళంకం తెచ్చిపెట్టనా? ఆ అనాథను తిరస్కరించనా? అను విషమసమస్యలు రెండుమీదబడి ఒకదానితో ఒకటి పెనగులాడి కొంతసేపిది కొంతసేపదీ విజయద్వారాన్ని సమీపించాయి. చిట్టచివరకి ఎల్లాగో మొదటిదే రెండోదాన్ని ఓడించేసింది. ఇంక

మనస్సుని స్థిరమార్గాన్ని పెట్టి మామూలుగా పాఠాలు పరీక్షదీక్షతో చదవడం ప్రారంభించాను. రాత్రి పది గంటలదాకా ఆ యువతి ప్రశంసే తల పెట్టుకోలేదు. తర్వాత ఆ యువతికి నా మనోనైర్మల్యాన్ని తెలియజేస్తేనేగాని ఏ సంగతీ తేలక పరితపిస్తుందేమో అని మనస్సుకి తట్టింది. వెంటనే నా విముఖత్వాన్ని అంతా విశదంగా తెలియజేస్తూ, కొన్ని పలహాలు ఆవిడకిచ్చి బోధిస్తూ ఒక ఉత్తరం వ్రాశాను. 12 గంటలు కొట్టగానే ఆలేఖ ఆమెకు అందియ్యాలని ఆ సాంకేతికస్థలానికి వెళ్లడానికి కొట్టుతాళంవేసి బయల్దేరాను. కాని మళ్లీ అక్కడికి వెడితే ఎవరేనా మాడ్డం సటస్థిస్తే ఏం అనర్థంవస్తుందో అని సగందాకా వెళ్లికూడా తిరిగివచ్చేసి పక్కమీద పడుకున్నాను. కాని తెల్లవార్లూ కంటిమీద కునుకన్నమాటలేదు. ఆవిడ పాపం ఎంతసేపు నారాకనిరీక్షిస్తూ ఆ నిశిరాత్రి విలపిస్తుందో అని చాలాచింతించాను. తెల్లవారడంతోటే చీటీ జేబులో వేసికొని గ్లాసు పుచ్చుకొని పాలకు బయల్దేరాను. "గద్దెమ్మా" అని పిలిచాను. కిటికీ తెరవబడింది. వెంటనే జేబులోని చీటీతీసి యువతికందిచ్చి మళీ వెనక్కి చూడకుండా పాలైనా పుచ్చుకోకుండా కొట్టుకి చేరుకొని పెద్ద బరువు దింపుకొన్నవాడిలాగ సంతోషించాను. ఆయువతి ఇంక కంటబడకుండా అక్కడ పాలవాడకం మానుకొని కొట్టుకూడా అక్కణ్ణుంచి మార్చేశాను. మళ్లీ ఆ ప్రశంస ఎప్పుడూ తలపెట్టుకోలేదు. తర్వాత కొద్దిరోజులకి ఒక పత్రికలో మొదటిపుటలో 'సత్యసందేశం' అను శీర్షికతో ఈక్రిందిమాస్తరుగా ప్రకటింపబడింది.

"నేనెవరినో మీకిచ్చట తెలుప దల్చుకోలేదు. తెలిసికోడానికి మీరుకూడా ప్రయత్నించవద్దు, నావంటివారి కెవరికైనా కొందరికి ఉపయోగిస్తుందనే నమ్మకంతో దీన్నిక్కడ వెల్లడిచేస్తూన్నాను. నేనొక బాలవితంతువుని. నాభర్తగారు నాఆరవయేటనే ఏడైతొరవసంవత్సరం నిండి చనిపోయినారట. నావివాహం వల్లనే మాతలిదండ్రుల గర్భ దారిద్ర్యం తీరిపోయింది. ఇప్పుడు నాకు ఇరవై ఏళ్ళు. ప్రతివారికీ సహజంగా కలిగే సుఖాపేక్ష నాకుకూడా కలిగి అప్పుడప్పుడు నన్ను బాధిస్తూండేది. ఏంచెయ్యను? వీధిలోకి రావడానికే నాకు అర్హతలేదు. ఇంట్లోఅయినా స్వేచ్ఛగా అందరితోపాటూ పెళ్ళిళ్లలోనూ పేరంటముల్లోనూ పాల్గోవచ్చా. కూడదు. మానాన్నగారికి ఎంతఇష్టంలేకపోయినా మాఅమ్మపోరువల్ల ఇంకా ఓరవికెన్నీ, ఒకటిరెండు చిన్నవస్తువులున్నూ ధరించడానికి మాత్రం హక్కుకలిగున్నాను. ఈమధ్య ఈఊరినుంచి కేశఖండనానికి రామేశ్వరయాత్ర బయల్దేరిన కొందరు వితంతువులతో నన్ను కూడా పంపిస్తానని మాఅమ్మతో హోరాహోరీగా పోరాడేడు మానాన్న, కాని మాఅమ్మ నాలుగైదు రోజులు అన్నం కూడా మానేసి ఏల్లాగో మానాన్నను కొంతవరకు గెలిచింది. అయినా అప్పుడప్పుడాయన ఆప్రసంగం తీసుకొచ్చి మాఅమ్మని ఒప్పించడానికి పూనుకొనేవాడు. ఇంతకీ పురాణంచెప్పే సరవాపధాన్లుగారి కూతురికే ఇంకా కేశాలు తీయించుకోలేదంటే అప్రతిష్టవచ్చి మీదపడిపోతుందనీ ఆయన భయం. అంతే కాని ఆయన ఛాదస్తం, నామీద పాపం! ఆయన కేం ద్వేషముంటుంది? అంచేత కేశాలు తీయించేస్తే తద్దినంవంటకీ దానికీ ఉపయోగిస్తూంటుందని ఆయన మాఅమ్మకు ఊరికే నూరిపోసేస్తోండేవాడు. ఆప్రసంగాలన్నీ వింటూంటే నాకు గుండెల్లో గునపాలుచ్చుకొని పొడుస్తూన్నట్టుండేది. ఇల్లా ఎల్లాగో జీవచ్ఛవంలా కాలంగడుపుతూన్నాను. నామనస్సు ఎక్కడ సుఖాలవైపు తిరిగిపోతుందో అని మానాన్న నాకు జ్ఞానవాశిష్టంలోని వైరాగ్యప్రకరణం వగైరా చదివించి బోధిస్తూండేవాడు. ఏకాశి ఏకాశికి పూర్ణిమ చవితి మొదలైన ఉపవాసదినాల్లో నాకిష్టం లేకపోయినా బలవంతంగా తిండిలేక మాడవలసివచ్చేది. అయితే మాత్రం మానవజాతికే కాకుండా పశుపక్ష్యాదు లన్నింటికీ కూడా సహజంగా పుట్టుకొచ్చే సుఖానుభవాపేక్ష పోవుర్చుతుందా? నాకు ఎల్లా పోతుంది. ప్రేమసౌఖ్యంలో ఒక్కలవలేశమైనా రుచి చూడాలని నామనస్సు ఊరికే ఉవ్విళ్ళూరు

తోంచేది. అయితే మాత్రం నాకల్లాంటి సావకాశం ఎల్లా దొరకుతుంది. ఎల్లాగో మొత్తానికి మాయింటి ప్రక్క గొల్లయింటికి ప్రొద్దున్నే పాలకొచ్చే ఒక యువకుడిమీద నాదృష్టిని ప్రసరింపజేశాను. నేను చూస్తే మాత్రం ఆనిష్కళంకమూర్తి నాకేసి ఎల్లా చూస్తాడు. ఇల్లా కొన్నిరోజులుగడిచాక ఎల్లాగో రెండుమూడుత్తరాలు కూడా అతనికి అందజేశాను. కాని ఆయువకుడు అస్ఖలిత బ్రహ్మచారి, అతని యుద్దేశ్యాలు సంసారసుఖాలమీద లవలేశమైనా ఆధారపడిలేవు. అందుచేత ఆయన నాఅభిప్రాయంతో ఏకీభవించనందుకు విచారిస్తూ నామూడవలేఖకి సమాధానంగా ఈక్రింది వ్రాసినరీతిగా సువర్ణలేఖను నాకందిచ్చాడు. ఈలేఖను ఎన్నిసార్లుచదివేనో లెఖ్ఖలేదు. చదివినకొద్దీ నాభావాలు సంసారిక సుఖాలమీదనుంచి మళ్ళిపోయి దేశభక్తిని పురికొల్పుతూంటాయి. నేను నాప్రేమను మొదటిసారే ఆయువకుడి ఆధీనంచెయ్యడంచేత తిరిగి దాన్ని ఇంకొవ్యక్తిమీదికి త్రిప్పడానికి మనస్కరించక బ్రహ్మచర్యదీక్షనే స్వీకరించాను. ఇప్పుడు నేను నాతల్లిదండ్రులవద్ద లేను. దేశభక్తిని ప్రబోధించేపవిత్రమైన ఒకసంఘంలో నివసిస్తున్నాను. కొద్దికాలంలో భగవంతుని అనుగ్రహంవల్లా మీఆశీర్వాదాలవల్లా సంచారంచేస్తూ బాలవితంతువుల విధ్వంసానికి యావజ్జీవము నాఓపికకొద్దీ దేశసేవచేసి ఋణవిముక్తురాల నవుతాను.

## లేఖ

సోదరీ? నీవు నాకతిపహృదయానికి నన్నెంత నిందించినాసరే కాని నీయభిలాష తీర్చడానికి నా మనస్సు ఒప్పుకోదు, ఏమీఅంటే ఈతుచ్ఛ సంసారసౌఖ్యాలన్నింటికంటె బొందిలో జీవమున్నంతవరకూ నిష్కళంకబ్రహ్మచర్యంతో దేశసేవజేసి శాశ్వతయశస్సుని చూరగొనాలని ఇదివరకే నిశ్చయం చేసేనుకుంది. ఇప్పుడు దాన్ని తప్పించటానికి నాకు ఇష్టంలేదు. శక్యంకూడాకాదు. నీఅవస్థ చూస్తేమాత్రం నాకు నిలువెల్లా నీరైపోతూంది. దాన్ని నీవు కోరినట్లుచేసి తప్పించలేకపోయినా ఆ అవస్థ తొలగిపోయే ఒకటి రెండు సలహాలు రాస్తూన్నాను. నీకిష్టమైతే ఆప్రకారం తప్పకుండా అనుసరించడం నాఅభీష్టం. అదేమంటావా? జలబుద్బుదంలాంటి అస్థిరమైన యీఅస్థిపంజరాన్ని ఎవ్వరికీ ఏమీ ఉపయోగంలేకుండా సంసారభోగాల్లో సుఖింపజేసి ఊరూ పేరూ లేకుండా నశింపుచెయ్యడంకంటె ఏకొద్దిమందికైనా ఏదో రూపకంగా ఉపకరింపజేస్తే చాలాబాగుంటుంది. ప్రజాసేవవల్ల సాంసారికసుఖంకంటే ఎక్కువ అనందరసాన్ని ఆస్వాదించవచ్చు. ఇతర స్త్రీలకంటె మీవంటి వితంతువులికి ఈప్రకారంగా కాలం ఉపయోగించడానికి ఎక్కువ సావకాశం ఉంది. జీవితాంతం వరకూ పవిత్రమైన ఉద్దేశ్యంతో మాత్రం ప్రవర్తించాలి. మధ్యగా అభిప్రాయం మారితం దంటే మొదటిస్థితికంటే ఈస్థితే ఎక్కువ వ్యర్థమైపోతుంది. నీకు తెలుసుంటే ఒక్కసారి నీదృష్టిని ప్రస్తుతంలోనూ, ఇంతకు పూర్వంలోనూ దేశసేవయందాసక్తి కలిగి ప్రవర్తించిన పవిత్రనారీమణులకేసి మళ్ళుచుకో, అంతకంటే కూడానువ్వు ఎక్కువ పవిత్రంగా సంచరించాలని ప్రమాణపూర్వకంగా నీహృదయాన్ని అనుశాసించుకో, ఇల్లా చెయ్యడమే నాముఖ్యోద్దేశ్యం. నీభావం అంతవరకూ తాళకపోతే ఎవరినైనా ఒక సజ్జనయువకుణ్ణి బాగాపరీక్షించి చూచి అతన్ని హృదయపూర్వకంగా ప్రేమించి పెండ్లాడి తర్వాత ఎన్నిపర్వతాల్లాటిక్లిష్ట విషయాలువచ్చి మీదపడ్డా అతన్ని సర్వదాఅనుసరించి సేవించడమే రెండవపద్ధతి, ఈపద్ధతిని నీవభిలషించేటట్టయితే నీకు తగినవరుణ్ణి అన్వేషించిపెట్టేభారం నామీదవెయ్యవచ్చు. నేను ఈవిషయంలో ఎక్కువ సహాయంచేస్తాను. ఈరెండుపద్ధతుల్లోనూ ఏపద్ధతిని అవలంబించడానికైనా ఇప్పుడు నువ్వు నీతల్లిదండ్రుల్ని పరిత్యజించక తప్పదు. కొంతకాలంవరకూ లోకులు నీమీదమోపే అపవాదులు భరించకతప్పదు. నీవు నిష్కళంకంగా త్రికరణశుద్ధిగానే కనకసంచరిస్తే కొన్నాళ్ళయినాక మొదట నిందించిన లోకులచేతే మితి లేనిగౌరవం పొందుతావు. నీతల్లిదండ్రులు నీపుట్టుకవల్ల తమజన్మం సార్థకమైనాయని పరమానంద భరితులవుతారు. ఏది అంగీకరిస్తావో, బాగా ఆలోచించుకో,

ఇట్లు
నీసోదరుడు.

474